క్లుప్తంగా

మోసం చేసిన వ్యక్తిపై కేసు

ఇల్లందకుంట: రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నానని నమ్మించి భూమి అమ్మిస్తానని చెప్పి మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎస్సై రాజకుమార్ తెలిపారు. జమ్మికుంట మండలం గండ్రపల్లి గ్రామానికి చెందిన బల్గూరి రాజేశ్వర్‌రావు అనే వ్యక్తి ఇల్లందకుంట మండలం రాచపల్లి గ్రామానికి చెందిన వనం సరోజన అనే మహిళకు చెందిన మాణిక్యపూర్ గ్రామంలో గల తన భూమిని అమ్మిస్తానని చెప్పి పట్టాదార్ పాసుబుక్ తీసుకొని మొత్తం తనకు గల 3.3ఎకరాల భూమి నుంచి 0.37 గుంటల భూమిని అయిదుగురు వ్యక్తులకు విక్రయించాడు. డబ్బులివ్వకుండా తనని మోసం చేయడమే కాకుండా చంపుతానని బెదిరిస్తున్నాడని బాధితురాలి ఫిర్యాదు మేరకు బల్గూరి రాజేశ్వర్‌రావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

పొన్నం సన్మాన సభకు తరలిన గౌడ సంఘం నేతలు


జమ్మికుంట: పొన్నంను సన్మానిస్తున్న గౌడ సంఘం నేతలు

జమ్మికుంట: జమ్మికుంట పట్టణం, మండలంలోని గ్రామాల నుంచి రాష్ట్ర బీసీ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌కు గౌడ కులస్తులు కరీంనగర్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం, సన్మాన సభకు గౌడ సంఘం నేతలు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్న కోటి, కౌన్సిలర్ బోంగోని వీరన్న ఆధ్వర్యంలో గౌడ కులస్తులు, సంఘాల నాయకులు ఆదివారం తరలివెళ్లారు. కరీంనగర్‌లోని వీకన్వేన్షన్ హాల్లో మంత్రిని శాలువాతో సత్కరించారు. గజమాలతో ఘనంగా సన్మానించారు. తడక శ్రీకాంత్, నేరేళ్ళ మహేందర్‌గౌడ్, దేశిని సదానందం, శ్రీపతి నరేష్, పైడిపల్లి ఆనందం, రాంమూర్తి, బుర్ర సంపత్, అయోధ్యగౌడ్, సదానందం, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.


రామడుగు: సభకు వెళ్తున్న గౌడ సంఘం నాయకులు

రామడుగు: గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన గౌడ, కార్మిక సంఘం నాయకులు ఆదివారం మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి తరలివెళ్లారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా గౌడ సంఘం ఐక్యవేదిక వారి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి వెళ్తున్నట్టు వారు తెలిపారు.


ఎస్సీ కార్పొరేషన్ రుణాలు మంజూరు చేయాలి

చొప్పదండి: గత ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యంతో ఎస్సీ కార్పొరేషన్ రుణాలు పూర్తిగా నిలిపివేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ రుణాలను మంజూరు చేయాలని తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం మండల శాఖ అధ్యక్షుడు బడుగు నరేశ్ ఆదివారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందించారు. రుణాలు నిలిపివేయడంతో రాయితీ రుణాలందక బలహీనవర్గాల యువకులు వెనుకబాటుకు గురవుతున్నారని, మంత్రి చొరవ చూపాలని కోరారు.

ఆలయ అభివృద్ధి కమిటీ ఏర్పాటు

చొప్పదండి: పట్టణంలోని పురాతన శివకేశవాలయం అభివృద్ధి కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, సభ్యులుగా ఇప్పనపల్లి సాంబయ్య, గుర్రం మల్లారెడ్డి, గుర్రం భూంరెడ్డి, నలుమాచు రామకృష్ణ, కటుకం భూమయ్య, వివేకానంద యూత్ క్లబ్ అధ్యక్షుడు దండె శ్రీనివాస్, అన్ని కుల సంఘాల అధ్యక్షులు, జనగామ సత్యనారాయణ, సింహాచలం ప్రభాకరాచార్యులు, కపిల మల్లికార్జున్, కోమటిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు ఎన్నికయ్యారు. హుండీ ద్వారా వచ్చే ఆదాయం ఆలయ అభివృద్ధికి ఖర్చు చేయాలని తీర్మానం చేశారు. గుడి పూజారుల జీతభత్యాలపై కమిటీ నిర్ణయం తీసుకోవాలని, గుడిలో కొత్తగా హుండీలు ఏర్పాటు చేయాలని, ఆలయ నిర్వహణ వివేకానంద యూత్ క్లబ్ చేయాలని తీర్మానాలు చేశారు.

పాఠశాల వార్షికోత్సవం



జమ్మికుంట: పట్టణంలోని గౌతమి హైస్కూల్‌లో వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ కొండల్‌రెడ్డి మాట్లాడుతూ.. క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. కరస్పాండెంట్ కృష్ణారెడ్డి, డైరెక్టర్ పల్లె రాజు, ఇంద్రసేనరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రోత్సహిస్తేనే సౌరభం

- సూర్యఘర్‌కు విస్తృత ప్రచారం అవసరం


సిర్సపల్లి గ్రామ శివారులోని ఓ రైస్ మిల్లుపై ఏర్పాటు చేసుకున్న సోలార్ యూనిట్

హుజూరాబాద్‌రూరల్: విద్యుత్ బిల్లుల మోతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఉపశమనం కలిగించేలా ప్రధాని నరేంద్ర మోదీ పీఎం సూర్యఘర్ ఉచిత పథకానికి శ్రీకారం చుట్టారు. ఈ పథకాన్ని ప్రజలు ఎంపిక చేసుకుంటే 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌తోపాటు అదనపు ఆదాయాన్ని సమకూర్చే పీఎం సూర్యఘర్ ఉచిత విద్యుత్ పథకం గురించి ప్రజలకు సరైన అవగాహన లేకపోవడంతో పథకానికి ప్రజలు దూరమవుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక రాయితీతో అందుబాటులోకి తీసుకురావడంతో వినియోగదారులు ఆసక్తి చూపిస్తున్నారు. కానీ విధివిధానాలు ఇప్పటివరకు రాలేదని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు. దీంతో ఈ యూనిట్ ఎలా పొందాలో.. ఎక్కడ సంప్రదించాలో తెలియక చాలా మంది నిరుత్సాహపడుతున్నారు. కేంద ప్రభుత్వ పథకం కావడంతో కొంతమంది నేరుగా తపాలా శాఖను సంప్రదిస్తూ దరఖాస్తు చేసుకుంటున్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రయోజనం చేకూర్చే ఈ పథకంపై అవగాహన కల్పిస్తూ సౌర విద్యుత్‌ను ప్రోత్సహించేలా విద్యుత్ శాఖ చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.

భారీ రాయితీతో ఆసక్తి

గృహావసరాల కోసం సౌర విద్యుత్ వ్యవస్థ ఏర్పాటు చేసుకునే అవకాశం ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ లిమిటెడ్(టీఎస్ రెండ్కో) ద్వారా రాష్ట్రంలో కొనసాగుతోంది. ఒక కిలో వాట్‌ను మొదలుకొని 10 కిలోల వాట్ వరకు ఈ సంస్థ రాయితీ అందిస్తుంది. కానీ దీనిపై స్పందన కరువైంది. గృహావసరాలరీత్యా రాయితీ అంతంతమాత్రమే ఉండటంతో ఆసక్తి చూపించడం లేదు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు లబ్ధి చేకూర్చేలా మూడు కిలోవాట్ల సామర్థ్యంతో కూడిన సౌర విద్యుత్ వ్యవస్థకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల భారీ రాయితీ ప్రకటించడంతో వినియోగదారులు దీనిపై మక్కువ చూపుతున్నారు. రెండ్కో సంస్థ రూ.44వేలకు రాయితీ అందిస్తుండగా.. సూర్యఘర్‌తో రూ.78వేలు అందనుంది. మూడు కిలోవాట్లు దాటిన కేంద్రం రూ.78వేలు మాత్రమే అందిస్తుండగా.. రాష్ట్రానికి సంబంధించిన రెండ్కో కిలోవాట్ పెరుగుతున్నాకొద్దీ రాయితీలోనూ పెరుగుదల కనిపిస్తుంది.

300 యూనిట్ల లోపు వినియోగించేవారికి ప్రయోజనం

గృహ వినియోగదారుల్లో అధిక శాతం 100-300 యూనిట్ల వరకే పరిమితమవుతారు. ఇలాంటివారికి సూర్యఘర్ పథకం లబ్ధి చేకూరుస్తుంది. 3కిలోవాట్ సామర్థ్యం కలిగిన సౌర విద్యుత్ వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలి. దీనికయ్యే ఖర్చు(సుమారు రూ.లక్షన్నర)లో రూ.78వేలు రాయితీ లభిస్తుంది. ఆపై అవసరమున్నా అంతే రాయితీ వర్తిస్తుండగా, మూడు కిలోవాట్ల తక్కువకు మాత్రం ఖర్చులో 60 శాతం రాయితీ వస్తుంది. 0-150 యూనిట్లు మాత్రమే ఉపయోగించే విద్యుత్ వినియోగదారులు రెండు కిలోవాట్ల రూఫ్ టాప్ వ్యవస్థను ఏర్పాటు చేసుకుంటే సరిపోతుంది. ఈ పథకం ఆశించిన స్థాయిలో వినియోగదారులకు చేరువ కావడం లేదు. ఈ పథకంపై విద్యుత్ శాఖ అధికారులు చొరవ తీసుకుంటేనే ప్రయోజనం చేకూరుతుంది. ఆసక్తి చూపించే గృహ వినియోగదారులకు లబ్ధి జరుగుతుంది.

సంపూర్ణంగా అవగాహన కల్పించాలి



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూర్యఘర్ పథకం గురించి గ్రామంలోని ప్రజలకు సంపూర్ణంగా అవగాహన కల్పిస్తేనే సరైన నిర్ణయం తీసుకొని ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటారు. గ్రామంలోని ప్రధాన కూడళ్ల వద్ద సంబంధిత అధికారులు పథకానికి సంబంధించిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తే ప్రజలకు అర్థమవుతుంది.

– పంజాల రేవంత్, గ్రామస్తుడు, చెల్పూర్

ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు



కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన సూర్యఘర్ పథకానికి సంబంధించిన దరఖాస్తులను తపాలా కార్యాలయంలో స్వీకరిస్తున్నాం. ఆన్‌లైన్ ద్వారా సైతం దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉంది. ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలంటే ఇంటి నెంబర్, ప్రస్తుత కరెంట్ బిల్లు ద్వారా ఇంటికి ఎన్ని కిలోవాట్ల యూనిట్ల అవసరమో వినియోగదారులే అంచనా వేసుకొని దరఖాస్తు చేసుకుంటే.. సంబంధిత అధికారులు ఇంటికి వచ్చి పథకానికి సంబంధించిన పనులను ప్రారంభిస్తారు.

– యు.మహేందర్, పోస్టు మాస్టర్, హుజూరాబాద్



అపూర్వ సమ్మేళనం

శంకరపట్నం: వంకాయగూడెంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం 1998-99 బ్యాచ్‌కు చెందిన పదోతరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. సుమారు 80 మంది పాల్గొన్నారు. చదువు చెప్పిన గురువులను సన్మానించారు. ఉపాధ్యాయులు బోధించిన విద్యాబుద్ధులతోనే సమాజంలో గుర్తింపు తెచ్చుకున్నామని, అభివృద్ధి చెందామని అన్నారు. సాయంత్రం వరకు చిన్ననాటి జ్ఞాపకాలతో ఆనందంగా గడిపారు.

చేపల వేటకు వెళ్లి వృద్ధుడి మృతి


నర్సయ్య(ఫైల్)

తిమ్మాపూర్(మానకొండూర్): చేపల వేటకు వెళ్లిన ఓ వృద్ధుడు నీటిలో మునిగి మృతిచెందిన ఘటన పొరండ్ల గ్రామంలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. తిమ్మాపూర్ మండలం పొరండ్లకు చెందిన సదిరె నర్సయ్య(63) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ముదిరాజ్ కులస్తులతో కలిసి గ్రామంలోని పులిచెరకుంటలో చేపల వేటకు వెళ్లాడు. చేపలు పడుతూ ఒక్కసారిగా చెరువులోనే కుప్పకూలాడు. పక్కనే ఉన్న మత్స్యకారులు హుటాహుటిన అతడిని గ్రామంలోని ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. గుండెపోటుతో మరణించి ఉంటాడని గ్రామస్తులు భావిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. నర్సయ్యకు భార్య ఉంది.

గుర్తుతెలియని వ్యక్తికి గాయాలు


గాయాలపాలైన వ్యక్తి

మానకొండూర్: సదాశివపల్లి సమీపంలోని డీబీఎం 2 సమీపంలో ఆదివారం రాత్రి గుర్తుతెలియని ద్విచక్ర వాహనదారుడు అదుపుతప్పి కింద పడి తీవ్ర గాయాలపాలపాలయ్యాడు. టీఎస్02ఈవీ4530 ద్విచక్ర వాహనంపై అల్గునూర్ నుంచి మానకొండూర్ వైపు వస్తుండగా.. మానకొండూర్ రైస్‌మిల్లుల సమీపంలోని డీబీఎం 2 సమీపంలో కింద పడి గాయాలపాలయ్యాడు. స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించగా.. వెంటనే 108 సిబ్బంది గాయాలపాలైన వ్యక్తిని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతడి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని 108 సిబ్బంది తెలిపారు. ద్విచక్ర వాహన ఓనర్ జగదీష్ ఉపాధ్యాయ అని తెలిసింది. ద్విచక్ర వాహనంలో ఉన్న పేపర్‌లో జమ్మికుంట అని ఉంది.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


మహిళలను సన్మానించిన వాసవి వనిత క్లబ్ సభ్యులు

జమ్మికుంట: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు మురికి పూర్ణిమ అన్నారు. ఆదివారం పట్టణంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవం పురస్కరించుకొని వేడుకలు నిర్వహించారు. అతిథులుగా హాజరైన సీనియర్ డాక్టర్ హేమలత, ప్రవచన రత్న బిరుదాంకితురాలు కోత్తూరు జయశ్రీ, గీతా ప్రచారకురాలు విశ్వహిందూ పరిషత్ జిల్లా మాతృశక్తి సంయోజకురాలు భాగ్యలక్ష్మి, ఫార్మర్ ఆర్గానిక్ ఫార్మింగ్ ఆదర్శ రైతు అవార్డు గ్రహీత స్వరూప, డాక్టర్ వాణి, చార్టెడ్ ప్రెసిడెంట్ గర్రెపెల్లి అరుణాదేవిని సన్మానించారు. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ గవర్నర్ డాక్టర్ మధవి, సెక్రటరీ భాగ్యలక్ష్మి, ట్రెజరర్ మాడిశెట్టి రేవతి, వాసవి వనిత క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

వాహనదారుల ఆందోళన

కరీంనగర్ క్రైం: నగరంలోని రాంనగర్ చౌరస్తా వద్ద ఆదివారం రాత్రి వాహనదారులు ఆందోళన నిర్వహించారు. కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు రాంనగర్ చౌరస్తాలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తుండగా వాహనదారునికి, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులు తనను దూషించారని పేర్కొంటూ వాహనదారుడితో పాటు పలువురు అక్కడికి చేరుకొని ఆందోళన చేపట్టడంతో ట్రాఫిక్ జాం ఏర్పడింది. టూటౌన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఆందోళన చేస్తున్న వారిని అక్కడ నుంచి పంపించారు.

సావిత్రిబాయి పూలేకు నివాళి



హుజూరాబాద్‌లో సావిత్రిబాయి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, నాయకులు, హుజూరాబాద్‌లో నివాళి అర్పిస్తున్న నాయకులు

హుజూరాబాద్: భారతదేశ చదువుల తల్లి, తొలి మహిళ ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే వర్ధంతి వేడుకలు ఆదివారం జమ్మికుంట రోడ్‌లోని సివిల్ ఆసుపత్రి సమీపంలో జ్యోతిరావు పూలే జయంతోత్సవ కమిటీ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, జ్యోతిరావు పూలే జయంతోత్సవ కమిటీ చైర్మన్ బుర్ర కుమార్‌గౌడ్, గౌరవ అధ్యక్షుడు మహమ్మద్ ఖలీద్ హుస్సేన్, అంబేడ్కర్ జయంతోత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు వేల్పుల రత్నం, కాంగ్రెస్ నాయకులు సొల్లు బాబు, వేముల పుష్పలత, సొల్లు సుశీల, సాదుల రవీంద్రబాబు, డాక్టర్ తడికమళ్ల శేఖర్, జమదగ్ని, రాజేశ్, వేల్పుల ప్రభాకర్, తునికి సమ్మయ్య, బత్తుల రాజలింగం, తాళ్లపల్లి అమరేందర్, ఏనూరి అశోక్, దాట్ల ప్రభాకర్, గాజుల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఆదివారం సాయంత్రం పూలే జయంతోత్సవ కమిటీ చైర్మన్ సంధ్యల వెంకన్న ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ సంఘం జిల్లా అధ్యక్షుడు చందుపట్ల జనార్దన్ మాట్లాడుతూ.. స్త్రీ విద్య కోసం అలుపెరగని కృషి చేసిన మహనీయురాలని కొనియాడారు. ఆమె ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. నాయకులు పి.లతారెడ్డి, మాడుగుల ఓదెలు, శ్యాంసుందర్, కొలిపాక శంకర్, అమరేందర్, సత్తిరెడ్డి, బత్తుల రాజలింగం, ఎర్ర రవీందర్, కొమురయ్య, సొల్లు బాబు, సారన్న తదితరులున్నారు.

సభ విజయవంతం చేయాలి

గన్నేరువరం: మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పాల్గొనే కదనభేరి సభ ఈనెల 12న కరీంనగర్‌లో జరుగుతుందని, విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు అన్నారు. గన్నేరువరంలో ఆదివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి గ్రామం నుంచి జన సమీకరణ చేయాలని, రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినిపల్లి వినోద్‌కుమార్ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. జెడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు గంప వెంకన్న, మహిళా అధ్యక్షురాలు కుసుంభ నవీన, ఎంపీటీసీ ఫోరం మండల అధ్యక్షుడు గూడెల్లి ఆంజనేయులు, మాజీ సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శంకరపట్నం: అబద్ధాల వాగ్దానాలతో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆరోపించారు. మండలంలో బీఆర్ఎస్ కదనభేరి సమావేశం నిర్వహించారు. అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిందని, ఎంపీ ఎన్నికలు తర్వాత అన్ని మూసుకుపోతాయన్నారు. జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మహిపాల్, సంజీవరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.


గన్నేరువరంలో మాట్లాడుతున్న రసమయి

పీఆర్సీ ప్రకటించడంపై హర్షం

గన్నేరువరం: ఆర్టీసీ ఉద్యోగులకు 21 శాతం పీఆర్సీ ప్రకటించడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు ఆదివారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో గన్నేరువరంలో క్షీరాభిషేకం నిర్వహించారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి చిట్కూరి అనంతరెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు చింతల శ్రీధర్‌రెడ్డి, ఎన్ఎస్‌యూఐ నాయకులు లింగంపల్లి శ్రీకాంత్, కాంతాల అంజిరెడ్డి, బాలయ్య, కొమురయ్య, స్థానికులు పాల్గొన్నారు.


గన్నేరువరంలో సీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

గన్నేరువరం: గ్రామాల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ లింగాల మల్లారెడ్డి అన్నారు. మైలారం గ్రామంలో రూ.10లక్షల నిధులతో చేపట్టే సీసీ రహదారి పనులను ఆదివారం ఎంపీపీ ప్రారంభించారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కృషితో నిధులు మంజూరయ్యాయని తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, నాయకులు దుడ్డు మల్లేశం, చింతలపల్లి నర్సింహారెడ్డి, ముస్కు కరుణాకర్‌రెడ్డి, గువ్వ వీరయ్య, వొడ్నాల నర్సయ్య, దుడ్డు నాగరాజు, గడ్డం రాజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఆసిమోద్దీన్ పాల్గొన్నారు.


మైలారంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ మల్లారెడ్డి

బహుమతుల అందజేత

కరీంనగర్‌స్పోర్ట్స్: గిద్ద పెరుమాళ్లస్వామి ఆలయ గ్రౌండ్‌లో జరిగిన క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు ఆదివారం పీసీసీ రాష్ట్ర కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్ టీం జీపీ విన్నర్ కప్, రన్నర్ కప్ అందజేశారు. వైద్యుల అంజన్‌కుమార్ మాట్లాడుతూ.. ఈ యూనిటీ ద్వారా మంచి స్నేహసంబంధాలు పెంచుకోవడంతోపాటు క్రీడాస్ఫూర్తితో ముందుకుపోవాలని తెలిపారు. క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులు సన్నీ, శివరాజ్, బండారి మారుతి, ఇమ్రాన్, దేవేందర్, హరీశ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సుస్థిర అభివృద్ధి

గన్నేరువరం: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సుస్థిర అభివృద్ధి సాధ్యమని మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు అన్నారు. గుండ్లపల్లి నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం పొత్తూరు గ్రామం వరకు డబుల్ రహదారి నిర్మాణానికి రూ.70కోట్ల నిధులు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కృషితో మంజూరు చేయడంపై ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం హయాంలో బీటీ రహదారి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని సంబరాలు చేసుకుంటే బీటీ రహదారిని తొలగించారని విమర్శించారు. మట్టి రహదారిపై ప్రయాణానికి ప్రజలు ఎంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన మూడు నెలల్లో ప్రత్యేక జీవో ద్వారా నిధులను మంజూరు చేయించి రహదారి పనులకు మోక్షం కల్పించారని అన్నారు. దశలవారీగా మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

దేశరాజ్‌పల్లి కాంగ్రెస్ సమావేశం

రామడుగు: దేశరాజ్‌పల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం ఆదివారం గ్రామంలో నిర్వహించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని నిర్ణయించుకున్నారు. గ్రామ శాఖ అధ్యక్షుడు మాడుగుల రత్నాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా కార్యదర్శి కోల రమేశ్, నాయకులు రసూల్, కనకయ్య, ఎల్లేష్‌కుమార్, మధు, రాంప్రసాద్, సంపత్, దామోదర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.


పాల్గొన్న నాయకులు

ఎస్సైని కలిసిన ఎంపీటీసీ ఫోరం మండల అధ్యక్షుడు


ఎస్సై నరేష్‌ను సన్మానిస్తున్న ఆంజనేయులు

గన్నేరువరం: గన్నేరువరం పోలీస్ స్టేషన్ ఎస్సైగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన తాండ్ర నరేష్‌ను ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు గూడెల్లి ఆంజనేయులు కలిసి సన్మానించారు. బీఆర్ఎస్ నాయకుడు న్యాత సుధాకర్, బీసీ సెల్ విభాగం మండల అధ్యక్షుడు చింతల రవి, తాడూరి వెంకటరమణారెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు న్యాలపట్ల శంకర్, బామండ్ల తిరుపతి, గంట సంతోష్ పాల్గొన్నారు.